# తీరం.. అపవిత్రం

- పుష్కర ఘాట్‌ల వద్ద దర్శనమిస్తున్న మద్యం సీసాలు
- కోటిపల్లి రేవులోని పార్కు వద్ద అసాంఘిక కార్యక్రమాలు
- ప్రారంభానికి నోచుకోని పర్యాటక భవనంలో జూదాలు

**కె.గంగవరం:** పవిత్రంగా గోదావరిలో స్నానం చేద్దామని పుష్కర ఘాట్‌లకు వచ్చే భక్తులకు మద్యం సీసాలు, మాంసపు ముక్కలు, ఇతర పదార్థాలు దర్శనమిస్తున్నాయి. మందుబాబులు పుష్కర ఘాట్‌లను వారికి నచ్చిన విధంగా మార్చేస్తున్నారు. కోటిపల్లి రేవును పర్యాటకంగా తీర్చిద్దిడానికి పార్కు వంటి సదుపాయాలు సుమారు రూ.4 కోట్లతో నిర్మించి సగంలో ఆపేశారు. ఇక్కడ రాత్రి సమయంలో వ్యభిచారం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. వీరి ఆగడాల వల్ల గోదావరి పవిత్రత అపవిత్రమవుతుంది. అంతేకాకుండా మద్యం సీసాలు పగిలిన ముక్కలు కాలికి తగిలి గాయాలపాలవుతున్నామని భక్తులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు మాత్రం చీమకుట్టినట్టు వ్యవహరిస్తున్నారు.

**మినీ బార్లుగా ఘాట్‌లు**

కోటిపల్లి, మసకపల్లి, కూళ్ల, సుందరపల్లి, కోట వంటి గ్రామాల్లో ఉదయాన్నే ప్రజలు పుష్కర ఘాట్‌లకు వచ్చి స్నానమాచరిస్తున్నారు. మండలంలో ఉన్న అన్ని పుష్కర ఘాట్‌లు రాత్రి అయితే చాలు మినీ బార్లుగా మారిపోతున్నాయి. మండలంలోని కోటిపల్లి, మసకపల్లి, కూళ్ల, సుందరపల్లి, బ్రహ్మపూరి ఘాట్‌ల వద్ద రాత్రి సమయంలో మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. వీటితోపాటు పలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా ఘాట్‌లను వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో వీరి ఆగడాలు మరింత ఎక్కువయ్యాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై అటు పంచాయతీ అధికారులు, ఇటు పోలీసులు కానీ తమది కాదులే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఏ ఘాట్‌లో చూసినా మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు, ఇతర చెత్తా చెదారం కనిపిస్తున్నాయి. గ్రామాలకు చివర ఈ ఘాట్‌లు ఉండటం వల్ల అకతాయిలకు అడ్డాగా మారాయి. ఈ ఘాట్‌లపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

**అపరిశుభ్రంగా కోటిపల్లి తీరం**

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కోటిపల్లిలో మూడు చోట్ల భారీ పుష్కర ఘాట్‌లను నిర్మించారు. కానీ పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉండటంతో ఘాట్‌లు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఉదయాన్నే ఘాట్‌ల వద్ద మద్యం సీసాలతో, పలు చెత్తాచెదారంతో ఘాట్‌లు నిండిపోయి ఉంటున్నాయి. పలు ప్రాంతాల నుంచి భక్తులు ప్రతిరోజూ గ్రామంలో కొలువై ఉన్న ఛాయా సోమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. పుణ్యస్నానాలు కూడా ఆచరిస్తుంటారు. కానీ ఘాట్‌ల వద్ద మద్యం సీసాలు దర్శనమివ్వడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. పర్యాటక భవనం పూర్తైనప్పటికీ ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఇదే అదునుగా ఈ భవనాన్ని పేకాట శిబిరంగా మార్చేశారు. రేవులో వద్ద ఉన్న పార్కులో రాత్రి సమయాల్లో అసభ్యకర సన్నివేశాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.



అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన పార్కు



కోటిపల్లి పుష్కర ఘాట్ వద్ద మద్యం సీసాలు

### అధికారులు చర్యలు తీసుకోవాలి

పుష్కర ఘాట్‌లు అపవిత్రం కాకుండా అధికారులు చొరవ తీసుకోవాలి. ఎప్పటికప్పుడు ఘాట్‌లను పరిశుభ్రంగా ఉంచాలి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి.

– పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ, కె.గంగవరం.

### ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం

కోటిపల్లి పుష్కర ఘాట్‌ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకొని వారికి బుద్ధి చెబుతాం. రాత్రి సమయంలో కూడా గస్తీ నిర్వహించి అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– జానీ భాష, ఎస్సై, కె.గంగవరం

## క్లుప్తంగా

### వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



మల్లవరంలో ప్రతిష్ఠించిన అభయాంజనేయుడి విగ్రహం

**కె.గంగవరం:** మండలంలోని కూళ్ల శివారు మల్లవరంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. వేద పండితులు ఉదయం 7 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో కనకదుర్గాదేవి

**కపిలేశ్వరపురం:** మాచర గ్రామ శివారు శ్రీరాంపురం గోదావరి గట్టుపై ఉన్న విజయ కనకదుర్గాశివ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు పెదపూడి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

### వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

**కపిలేశ్వరపురం:** ఇటీవల అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ సేవాదళ్ కన్వీనర్ పాలింగి కృష్ణ కిశోర్ చిన్నాన్న, గ్రామ వార్డు సభ్యురాలు పాలింగి సూర్యకాంతం సోదరుడు గన్నిరాజు మృతి చెందారు. దీంతో బుధవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, పలువురు నాయకులు వారిని పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు పలివెల మధు, నాయకులు మేడిశెట్టి దుర్గారావు, ప్రగడ అర్జునరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

### నీటమునిగిన రోడ్లు



కోలంకలో జలమయమైన యానాం- ద్వారపూడి రోడ్డు

**కాజులూరు:** బంగాళఖాతంలో ఏర్పడ్డ ఆవర్తన ద్రోణి ప్రభావంతో బుధవారం కాజులూరు మండలంలోని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఉక్కపోతతో ఉన్న వాతావరణం ఆకస్మాతుగా మబ్బులు కమ్ముకొని భారీ వర్షం కురవటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో పల్లపు ప్రాంతాలు, వీధులు జలమయమయ్యాయి. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ఇబ్బందులు తలెత్తాయి. కాగా, ఈ వర్షంతో వరి పొలాలకు కొంత మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు.

### కృష్ణాష్టమి వేడుకలకు శ్రీకారం

**రాయవరం:** మండలంలోని వెదురుపాక గీతా మందిరం వద్ద కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 16న వేకువ జామున స్వామి వారికి మేలుకొలుపు సేవ అనంతరం వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర సహస్ర నామార్చన, భగవద్గీత, 18 అధ్యాయాల పారాయణం, ఏకావహం నిర్వహిస్తామన్నారు. స్వామి వారి ఉత్సవ విగ్రహానికి పల్లకి సేవ, చిన్నారులతో రాధాకృష్ణ వేషధారణలు, సాయంత్రం ఉట్టి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

**కాజులూరు:** గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకుడు, గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మేడిశెట్టి వెంకట రమణమ్మ తదితరులు కోరుతున్నారు. బుధవారం గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ, వర్షాకాలం కారణంగా గ్రామాల్లో అపారిశుధ్యం తలెత్తి అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గతంలో వర్షాలు సమీపించిన వెంటనే గ్రామంలో అపారిశుధ్యం తలెత్తి పలువురు డెంగీ, విష జ్వరాల బారిన పడ్డారన్నారు. ఉన్నత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచి ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల్లో చైతన్య పరిచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

# డ్రగ్స్ జోలికి పోవద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రదీప్తి

**కపిలేశ్వరపురం:** యువకులు ప్రమాదవశాత్తు డ్రగ్స్‌కు అలవాటు పడితే, అది వారి జీవన విధానాన్ని దహించివేస్తుందని రామచంద్రపురం ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి హెచ్చరించారు. అంగరలోని సిద్దార్థ జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర అధ్యక్షతన ×సే నోట్ డ్రగ్స్₹ పేరుతో సదస్సును నిర్వహించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంగర ఎస్సై హరీష్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన సదస్సులో పోలీసు అధికారులు, కళాశాల అధ్యాపకులు యువతనుద్దేశించి ప్రసంగించారు. ప్రదీప్తి మాట్లాడుతూ, మానవ సమాజంలో ప్రస్తుతం మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా యువతను దెబ్బతీస్తుందన్నారు. మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా చట్ట పరిధిలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఎస్సై హరీష్ మాట్లాడుతూ, డ్రగ్స్‌కు సంబంధించిన చట్టపరమైన అంశాలను వివరించారు. విద్యార్థులు, పోలీసులు సంయుక్తంగా కళాశాల ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ శ్రీదేవి, కళాశాల చైర్మన్ దివ్య శేఖర్, కరస్పాండెంట్ వాకా రాజా, ప్రిన్సిపాల్ పి.రమణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుక



జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న గోపాలరావు

**రామచంద్రపురం:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రామచంద్రపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో విద్యార్థులు రావులపాలెం ఏఐటీయూసీ కార్యాలయం నుంచి పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనం వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఉండవల్లి గోపాలరావు పతాక ఆవిష్కరణ చేసి మాట్లాడారు. స్వాతంత్రం మాన జన్మ హక్కు. బ్రిటిష్ తెల్ల దొరలను తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. ।విద్యార్థులు చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు₹ అనే నినాదంతో ఉద్యోగాల కోసం చదవడం కాకుండా సమాజాన్ని మంచి దారిలో పెట్టడానికి మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులుగా ఎదగాలన్నారు. ఏఐటీయూసీ నాయకుడు రాము మాట్లాడుతూ, చరిత్ర తెలుసుకోవడం ద్వారా మంచి భవిష్యతును నిర్మించగలమని, 90 ఏళ్ల పోరాటం ఎందరో విద్యార్థి నాయకులను ఉన్నతమైన స్థానంలో నిలబెట్టిందన్నారు. జిల్లా అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ, జిల్లాలో విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నామని, విద్యార్థి హక్కుల సాధన లక్ష్యంగా శాస్త్రీయ విద్యా విధానం లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. విద్యార్థి సంఘాలను అణిచివేయాలనే ఆలోచనతో తీసుకొచ్చిన జీవోలను రద్దు చేయాలని, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ విడుదల చేయాలని కోరారు. జీవో నంబర్–77 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం



అంగరలో ధర్నా చేస్తున్న కార్మిక, కర్షక సంఘాల కార్యకర్తలు

**కపిలేశ్వరపురం:** స్మార్ట్ మీటర్లు బిగించడం, విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారా కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలను మోసగిస్తుందని ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు అన్నారు. మండలంలోని అంగరలో బుధవారం పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. గాంధీ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి భీమశంకరం మాట్లాడారు. సంపద సృష్టిస్తానని, అది తన బ్రాండ్ అంటూ చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకున్నారని, పాలనలో దానికి భిన్నంగా రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తూ సామాన్య ప్రజలపై భారాలను మోపుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో సంక్షేమ రాగం, గెలిచాక సంపన్నుల జపం చేయడం కూటమి ప్రత్యేకత అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతా రాజారెడ్డి, మద్దిరెడ్డి వెంకటరాజు, రైస్ మిల్లు జట్టు కార్మికులు పాల్గొన్నారు.

# త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



కొలువుదీరిన బ్రహ్మపూరి త్రిసభ్య కమిటీ

**కె.గంగవరం:** మండలంలోని బ్రహ్మపూరి సొసైటీ త్రిసభ్య కమిటీ బుధవారం కొలువుదీరింది. చైర్‌పర్సన్‌గా గెద్దం పల్లపరావు (బన్నీ), సభ్యులుగా చోడి ఆదిలక్ష్మి, కూరాటి పద్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వాసంశెట్టి సత్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, పదవులు అలంకారం కాదని, వాటిని బాధ్యతగా తీసుకొని పని చేయాలన్నారు. నూతనంగా కొలువుతీరిన త్రిసభ్య కమిటీ సభ్యులు పట్టుదలతో కృషి చేసి సహకార సంఘం బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. సొసైటీ అభివృద్ధితో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

### హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**రాయవరం:** మండలంలోని లొల్ల గ్రామంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. సాయి తేజా విద్యానికేతన్ విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### నేడు ఇంటర్వ్యూలు

**రాయవరం:** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. సెల్ఫ్ నామినేషన్, రికమెండెడ్ బై ఫైవ్ ఫెలో టీచర్స్ కేటగిరీ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానించగా, పెర్ఫార్మెన్స్ బేస్డ్ అవార్డ్ త్రూ లీఫ్ యాప్ కేటగిరీలో 8 మందిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు. దరఖాస్తు, ఎంపిక చేసిన వారికి గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ముమ్మిడివరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు దరఖాస్తుదారులకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి సమాచారం అందించారు. 1:1 నిష్పత్తి ప్రకారం ఫైనల్ జాబితాను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

### ఆగస్టు 15న సాయంత్రమే ఫ్రీ బస్సు అమలు

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని మహిళలకు ఫ్రీ బస్సు పథకం ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు సీఎం ప్రారంభించిన తర్వాత మాత్రమే అమలు చేస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. బాలికలు, మహిళలు, హిజ్రాలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపించాలని సూచించారు.

### తాళ్లమ్మకు గాజుల అలంకరణ

**కొత్తపేట:** స్థానిక కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారిని బుధవారం గాజులతో అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మిద్దే సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆసాదు పిల్లి వెంకటనాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొత్తం అమ్మవారి విగ్రహానికి గాజులు అలంకరించారు. కమ్మిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మంతెన సత్యసాయి, ఉపాధ్యక్షుడు కొత్తమాసు రాము, కోశాధికారి పట్టపు వీవీ సత్యనారాయణ, సభ్యుడు ఏడిద సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు దేశభక్తి అలవర్చుకోవాలి



విద్యార్థులకు జాతీయ జెండాలు అందజేసిన నాయకులు



కలువ పువ్వు సెంటర్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు

**రామచంద్రపురం రూరల్:** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు దేశ భక్తిని కూడా అలవర్చుకోవాలని బీజేపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు జాతీయ జెండాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీ కృష్ణ, జిల్లా ఐటీ విభాగం కన్వీనర్ బీవీఆర్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జాతీయ జెండా రెపరెపలు**

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట నియోజకవర్గంలో జాతీయ జెండా రెపరెపలాడింది. మండపేట పట్టణం, కపిలేశ్వరపురంలో బుధవారం నాయకుల ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలువ పువ్వు సెంటర్ నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ చేశారు. నాయకులు మాట్లాడుతూ, దేశ ఔన్నత్యం ప్రపంచంలో అగ్రభాగాన నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన



గ్రామస్తులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని నరసాపురపుపేట సచివాలయం వద్ద మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 2005 సమాచార హక్కు చట్టంలోని కీలక విషయాలపై గ్రామస్తులకు వివరించారు. సెక్షన్ 6(1) ప్రకారం, సమాచారం కోరే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, సెక్షన్ 2(జే)(11) ప్రకారం కోరిన ప్రతి సమాచారం, ప్రతి పేజీని అధికారులు ధ్రువీకరించి ఇవ్వాలని, సెక్షన్ 4(4) ప్రకారం సమాచారం తెలుగులో ఇవ్వాలని, సెక్షన్7(1) ప్రకారం అధికారులు 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించి 48 గంటల్లోపు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అజయకుమార్, వ్యవసాయ సహాయకుడు లాలిబాబు, మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి ఏడుకొండలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మండలాన్ని తూ.గో. జిల్లాలో కలపాలి

మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం



సమావేశంలో విలీనానికి ఆమోదం తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**రాయవరం:** తూర్పుగోదావరి జిల్లాలో రాయవరం మండలాన్ని విలీనం చేయాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. రాయవరం మండల అత్యవసర సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గాల పునర్విభజనకు సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని మండల తీర్మానం చేపట్టారు. ప్రస్తుతం రాయవరం మండలం మండపేట నియోజకవర్గ పరిధిలో ఉండటం, మండపేట నియోజకవర్గం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. జిల్లా కేంద్ర కార్యాలయానికి రాకపోకలు సాగించడంలోనూ, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా రాజమహేంద్రవరంతో ప్రజలకు అనుబంధం కలిగి ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం, వాణిజ్యం, వ్యాపార తదితర రంగాలకు సంబంధించిన కార్యకలాపాల్లో రాజమండ్రితో మండల ప్రజలకు అనుబంధం ఉందన్నారు. అందుకే ప్రజల అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని తీర్మానం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కీర్తిస్పందన, తహసీల్దార్ ఐపీ శెట్టి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# వర్షంతో స్తంభించిన జనజీవనం



సోమేశ్వరంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు



రాయవరంలో వర్షంలో ఇంటికి వెళ్తున్న విద్యార్థి



కె.గంగవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

**రాయవరం:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగి పొర్లాయి. పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

**ఇబ్బందులు పడ్డ విద్యార్థులు**

పాఠశాలల నుంచి సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కురిసిన భారీ వర్షానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గొడుగులు లేకుండా పాఠశాలకు వచ్చిన విద్యార్థులు వర్షంలో తడుస్తూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలల వద్ద ఆటస్థలాలు మునగడంతో పాటు పలుచోట్ల బురదమయంగా మారాయి.

**జోరు వాన**

**కె.గంగవరం:** మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జోరువాన కురిసింది. ఎడతెరుపు లేకుండా వర్షం పడటంతో జనజీవనం స్తంభించింది. భారీ వర్షం వల్ల భట్లపాలిక, కోట, కె.గంగవరం, అద్దంపల్లి తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన కాలువలు వర్షపు నీటితో పరిధి దాటి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు భూములున్న అముజూరు, కోటిపల్లి, పేకేరు, భట్లపాలిక తదితర గ్రామాల్లోని పొలాలు నీట మునిగాయి. మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 95 శాతం వరకు నాట్లు పూర్తి చేశారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో నాట్లు వేస్తారని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వర్షంతో ఉపసమనం పొందారు.